ప్రశాంతంగా వినాయక నిమజ్జనం

- ఆకట్టుకున్న సాంస్కృతిక ప్రదర్శనలు
- పోలీసులు గట్టి బందోబస్తు

మదనపల్లె సిటీ: మదనపల్లె పట్టణంలో శుక్రవారం గణేష్ నిమజ్జన కార్యక్రమం కనుల పండవగా జరిగింది. వినాయక ఉత్సవాల్లో భాగంగా ఐదో రోజు పట్టణంలోని ప్రశాంత్‌నగర్, సొసైటీకాలనీ, గొల్లపల్లి, అమ్మచెరువుమిట్ట, నిమ్మనపల్లె క్రాస్‌తో పాటు పలు ప్రాంతాల్లో వినాయక నిమజ్జనం నిర్వహించారు. వినాయక విగ్రహాలకు కడసారి పూజలు నిర్వహించారు. జై బోలో గణేష్ మహరాజ్‌కీ అంటూ ఊరేగింపుగా నిమజ్జనానికి తీసుకెళ్లారు. ఊరేగింపులో భాగంగా పలువురు వివిధ సాంస్కృతిక కార్యక్రమాలతో అలంరించారు. పోలీసులు గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు.

కేవిపల్లెలో..

కేవిపల్లె: మండలంలోని గర్నిమిట్టలో వినాయక విగ్రహాల నిమజ్జనం కార్యక్రమ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఐదు రోజుల కింద గ్రామంలో వినాయక విగ్రహాలను ఏర్పాటు చేశారు. ప్రతిరోజు స్వామివారి ఎదుట ప్రత్యేక పూజలు, సాంస్కృతి కార్యక్రమాలు నిర్వహించారు. శుక్రవారం స్వామివారి విగ్రహాని చాందినీ బండిలో ప్రత్యేకంగా అలంకరించి వైభవంగా ఊరేగింపు నిర్వహించారు. ఉదయాన్నే విగ్రహాల ఎదుట హోమాలు, యజ్ఞాలు నిర్వహించారు. అనంతరం వాహనాల్లో విగ్రహాలను కొలుదీర్చి మేళతాళాలతోచారు. పెద్ద ఎత్తున బాణాసంచా పేల్చుతూ బళ్లారి డ్రమ్స్‌తో ఊరేగింపు కొనసాగించారు. ఈసందర్భంగా పలుచోట్ల అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం సమీప చెరవుల్లో స్వామివారి విగ్రహాలను నిమజ్జనం చేశారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ గజ్జె లక్ష్మీ, మండల యూత్ కమిటీ అధ్యక్షులు గజ్జెల శీన్‌రెడ్డి, నాయకులు వేణుగోపాల్, హరిబాబు,చంద్రశేఖర్, గౌస్ తదితరులు పాల్గొన్నారు.



వాల్మీకిపురం: ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న భక్తులు

వాల్మీకిపురంలో..

వాల్మీకిపురం: స్థానిక జెట్టిపాళ్యంవీధిలో ఏర్పాటు చేసిన వినాయకుడి వద్ద శుక్రవారం సాయంత్రం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా గణపతి హోమం, కుంకుమార్చన సేవలు నిర్వహించారు. వీధిలో నివాసాలు ఉంటున్న వారంతా వినాయకుడి విగ్రహం వద్దకు వెళ్లి ప్రత్యేక పూజలు చేశారు. అలాగే వినాయక కమిటీ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

తంబళ్లపల్లెలో..

తంబళ్లపల్లె: వినాయక చవితి పండుగ సందర్భంగా ఊరూరా వెలసిన వినాయక విగ్రహాలను శుక్రవారం గంగలో కలిపి నిమజ్జనం చేశారు. మండల కేంద్రంలోని పాత కళాశాల మైదానంలో గణేష్ యూత్ సభ్యులు ఏర్పాటు చేసిన వినాయక విగ్రహాన్ని కోలాహలంగా భారీ బాణా సంచాపేలూళ్లతో కేరళ డ్రమ్స్ వాయిద్యాలతో ఊరేగింపు నిర్వహించారు. చుట్టు పక్కల గ్రామాల నుంచి విగ్రహాలను ఊరేగింపుగా తీసుకెళ్లి చిన్నేరుప్రాజెక్టులో నిమజ్జనం చేశారు. పోలీసులు గట్టి బందోబస్తు నిర్వహించారు.

బైబై గణేషా..

కలకడ : మండలంలోని కె.బాటవారిపల్లె, బాలయ్యగారిపల్లె, కె.దొడ్డిపల్లె, కోన పంచాయతీలలో నాలుగు రోజులు పాటు నిత్య పూజలు అందుకున్న గణపయ్యకు శుక్రవారం నిమజ్జనానికి తరలించారు. జైజై గణేష ..బైబై గణేషా అంటూ నినాదాలతో పాటలు, కోలాటం వంటి సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. అలాగే అన్నదానం చేశారు.

నిమజ్జన ఏర్పాట్లు పరిశీలన

మదనపల్లె సిటీ: మదనపల్లె పట్టణంలోని వినాయక నిమజ్జనం కోసం ఏర్పాట్లు చేసినట్లు పట్టణ వన్ టౌన్ సీఐ మహబూబ్‌బాషా తెలిపారు. స్థానిక సీటీఎం రోడ్డులోని తట్టివారిపల్లెచెరువు వద్ద ప్రత్యేకంగా రెండు క్రేన్లు, విద్యుత్ సౌకర్యం ఏర్పాటు చేశామన్నారు. వినాయకుని విగ్రహాలను చెరువులో నిమజ్జనం చేయాలని కోరారు.







కేవిపల్లె మండలం గర్నిమిట్టలో వినాయక విగ్రహం ఊరేగింపు,మదనపల్లె సిటీ: నిమజ్జనాకి తీసుకెళుతున్న వినాయక విగ్రహం , తట్టివారిపల్లెచెరువు వద్ద ఏర్పాట్లు పర్యవేక్షిస్తున్న సీఐ మహబూబ్‌బాషా

క్లుప్తంగా

107 మందికి ఏఐసీటీఈ స్కాలర్ షిప్పులు

కురబలకోట: మండలంలోని అంగళ్లు మిట్స్ ఇంజినీరింగ్ కళాశాల బీటెక్ విద్యార్థులు 107 మందికి రూ. 50 వేలు చొప్పున న్యూఢిల్లీ ఏఐసీటీఈ స్కాలర్ షిప్పులు అందాయని కళాశాల ప్రిన్సిపాల్ సి యువరాజ్ శుక్రవారం తెలిపారు. మెరిట్ ప్రాతిపదికపై ఈ స్కాలర్‌షిప్పులను విద్యార్థులకు వచ్చినట్లు తెలిపారు.

ఉపాధ్యాయుల నిరసన



నిరసన తెలుపుతున్న ఉపాధ్యాయులు

కలకడ : ప్రభుత్వం అమలు చేయనున్న జీపీఎస్ వద్దు- ఓపీఎస్ ముద్దు అని కలకడ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయులు నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేశారు. శుక్రవారం పాఠశాలలో మధ్యాహ్న భోజన విరామ సమయంలో నల్లబ్యాడ్జీలతో నినాదాలు తెలిపారు. కార్యక్రమంలో ఆ పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రేపు టౌన్‌బ్యాంక్ వార్షిక మహాజన సభ

మదనపల్లె : ది మదనపల్లె కో–ఆపరేటివ్ టౌన్ బ్యాంకు లిమిటెడ్ వార్షిక మహాజన సభ సమావేశం ఆదివారం ఉదయం 10.30 గంటలకు సీటీఎంరోడ్డులోని బ్యాంకు ప్రధాన కార్యాలయంలో నిర్వహించనున్నట్లు పర్సన్ ఇన్‌చార్జ్ శ్యామ్‌ప్రకాష్‌రెడ్డి, సీఈఓ పీ.వి.ప్రసాద్ తెలిపారు. శుక్రవారం టౌన్‌బ్యాంకు విడుదల చేసిన పత్రికాప్రకటన వివరాలిలా ఉన్నాయి. వార్షిక మహాజనసభ సమావేశానికి ఎ తరగతి సభ్యులందరూ హాజరుకావాల్సిందిగా కోరారు. సమావేశంలో 2022–23 వార్షిక నివేదికను, ఆడిట్‌రిపోర్ట్‌ను ఆమోదించుట, నికరలాభం పంపిణీ, 2023–24 సంవత్సరపు అంచనా బడ్జెట్‌ను ఆమోదించుట, వాయిదా మీరిన నిరర్థక ఆస్తుల బాకీదారుల వివరాలను సమీక్షించి నిర్ణయం తీసుకోవడం, బ్యాంకు సిబ్బంది పదవీ విరమణ వయస్సు 58 నుంచి 60 సంవత్సరాలకు పెంచడంపై సర్వీస్ బైలానెం 26 సవరణకు ప్రతిపాదన పంపుట తదితర అంశాలపై చర్చించనున్నట్లు పేర్కొన్నారు.

బాలాలయ ప్రతిష్ట



హోమం నిర్వహిస్తున్న వేదపండితులు

మదనపల్లె సిటీ: స్థానిక దేవళంవీధిలోని శ్రీ ప్రసన్న వెంకటరమణస్వామి ఆలయంలో శుక్రవారం జీర్ణోద్ధరణ, కళాకర్షణ బాలాలయ ప్రతిష్ట కార్యక్రమం నిర్వహించారు. వేదపండితులు లక్ష్మణ, బాలాజీలు వేదమంత్రోచ్చారణలతో హోమాలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ మాజీ చైర్మన్ బింగి పాండు, ఈఓ రమణ తదితరులు పాల్గొన్నారు. భక్తులు స్వామిని దర్శించుకున్నారు.

జోరుగా పంట నమోదు



పెద్దతిప్పసముద్రం: రైతు భరోసా కేంద్రాల్లో పని చేసే వ్యవసాయ శాఖ అసిస్టెంట్ అధికారులు పొలాల బాట పట్టారు. రైతు పొలంలో సాగు చేసిన పంట, ఎంత విస్తీర్ణంలో సాగు చేసారో సమగ్రమైన వివరాలను ప్రభుత్వ ఈ క్రాప్ యాప్‌లో నమోదు చేస్తున్నారు. అంతేగాక పంట నమోదు వల్ల రైతులకు కలిగే ప్రయోజనాలు, ప్రభుత్వ రాయితీలు, ఇన్సూరెన్స్‌లు, బ్యాంకుల్లో రుణాలు తదితర అంశాలపై రైతులకు క్షుణంగా వివరిస్తున్నారు. ప్రతి రైతు ఖచ్చితంగా పంట నమోదు చేసుకుంటేనే లేని పక్షంలో ప్రభుత్వం ద్వారా ఎలాంటి లబ్ధి పొందే అవకాశాలు ఉండవని స్పష్టం చేస్తున్నారు. రైతులందరూ పంట నమోదును సద్వినియోగం చేసుకోవాలని మండల కేంద్రం ఆర్‌బీకే ఇన్‌చార్జి ఆనంద్ పేర్కొన్నారు.

పోషకాహారంతోనే ఆరోగ్యం



మాట్లాడుతున్న ఎంపీపీ శ్రీదేవి

కలకడ : పోషకాహారంతోనే ఆరోగ్యం సాధ్యమని ఎంపీపీ శ్రీదేవి అన్నారు. శుక్రవారం పోషకాహార వారోత్సవాలను పురస్కరించుకుని బాలయ్యగారిపల్లె అంగన్‌వాడీ కేంద్రంలో ఏర్పాటు ఆహార పదార్థల ప్రదర్శన ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అంగన్‌వాడీకేంద్రాల ద్వారా అందించే పోషక, బలవర్ధకమైన ఆహారాన్ని అందరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. పోషక ఆహారం తీసుకోవడం వలన రక్తహీనత రాదని, సుఖప్రసవంతో పాటు ఆరోగ్యవంతమైన బిడ్డకు జన్మనివ్వవచ్చునని తెలిపారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ సూపర్‌వైజర్ శశికుమారి, ఏఎన్‌ఎం అంజనాదేవి, సిబ్బంది నందిని, చంద్రకళ, రమాదేవి, లక్ష్మీదేవి, తదితరులు పాల్గొన్నారు.

మహిళా రిజర్వేషన్‌లో కోటా అమలు చేయాలి

బి.కొత్తకోట: మహిళలకు 33 శాతం రిజర్వేషన్ల బిల్లును తీసుకొచ్చిన కేంద్రప్రభుత్వం అందులో బలహీనవర్గాలకు కోటా అమలు చేయాలని బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షులు మనిగే భాస్కర్‌నాయుడు డిమాండ్ చేశారు. శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ 1996 నాటి మహిళా రిజర్వేషన్ బిల్లును యథాతథంగా పార్లమెంటులో ప్రవేశపెట్టారన్నారు. దీనివల్ల కొన్ని వర్గాల మహిళలకు అన్యాయం జరుగుతుందన్నారు. ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ, మైనార్టీ వర్గాలకు ప్రత్యేక కోటా అమలు చేయాలని కోరారు. ప్రస్తుత బిల్లును అమలులోకి తెస్తే ఆధిపత్య కులాల మహిళలకు రిజర్వేషన్లుగా మారిపోతాయని ఆందోళన వ్యక్తం చేశారు. రిజర్వేషన్ల అమలులో సామాజిక న్యాయం పాటించాలన్నారు. ఈ విషయంలో రాజకీయ పార్టీలు తమ వైఖరిని తెలియజేయాలని కోరారు. ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ, ఓబీసీ ఎంపీ, ఎమ్మెల్యేలు దీనిపై ఒత్తిడి చేయాలని కోరారు.

యూటీఎఫ్ స్వర్ణోత్సవాలను జయప్రదం చేయాలి



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న యూటీఎఫ్ నాయకులు

మదనపల్లె సిటీ: యూటీఎఫ్ స్వర్ణోత్సవాలను జయప్రదం చేయాలని ఆ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి షేక్ జాబిర్ అన్నారు. శుక్రవారం స్వర్ణోత్సవాల ప్రచార పోస్టర్లను స్థానిక యూటీఎఫ్ కార్యాలయంలో ఆవిష్కరించారు. ప్రచారయాత్ర శనివారం రాయచోటి, పీలేరు మీదుగా మదనపల్లెకు చేరుకుంటుందన్నారు. విద్యా రంగ, ఉపాధ్యాయ సమస్యల అధ్యయనం కోసం ప్రచారయాత్రలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో జిల్లా గౌరవ అధ్యక్షులు రవిప్రకాష్, సుధాకర్‌నాయుడు, పురం వెంకటరమణ, సుధాకర్ భాస్కర్ రెడ్డి, అజ్మతుల్లా, శ్రీనివాసులు పాల్గొన్నారు.

అమృత వాటిక స్తూపానికి మట్టి సేకరణ

పీలేరు రూరల్ : ఆజాదీక అమృత్ మహోత్సవ్ కార్యక్రమంలో భాగంగా నా భూమి నాదేశం.. నేల తల్లికి నమస్కారం, వీరులకు వందనం కార్యక్రమం ద్వారా కర్తవ్య పథ్ అమృత వాటిక స్తూపానికి మట్టి సేకరించారు. శుక్రవారం కలికిరి ఐటీబీపీ ఆధ్వర్యంలో మండలంలోని బోడుమల్లువారిపల్లె పంచాయతీలో ర్యాలీ నిర్వహించారు. అక్కడ మట్టి సేకరించి కలిశంలో మట్టిని ఢిల్లీకి పంపుతున్నట్లు ఐటీబీపీ కమాండెంట్ అమిత్ బాటి తెలిపారు. కార్యక్రమంలో ఇన్స్‌పెక్టర్ వై.వి. రెడ్డి, కృష్ణారెడ్డి, రాజశేఖర్, సర్పంచ్ జయలక్ష్మీదేవి, జ్ఞానశేఖర్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శి హరిప్రసాద్‌నాయుడు, మాజీ సైనికులు జానశేఖర్, శివప్రసాద్‌రాజు, లక్ష్మీప్రసాద్‌రెడ్డి, జి. మహేశ్వర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



మట్టిసేకరణ కార్యక్రమంలో ఐటీబీపీ అధికారులు

యువజనోత్సవాల్లో విద్యార్థుల ప్రతిభ

మదనపల్లె : రాష్ట్రప్రభుత్వం ఆధ్వర్యంలో రాజంపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నిర్వహించిన జిల్లా స్థాయి యువజనోత్సవాల్లో జ్ఞానాంబిక డిగ్రీ కళాశాల విద్యార్థినులు ఉత్తమ ప్రతిభ కనపరిచి ప్రథమ, ద్వితీయ బహుమతులతో పాటుగా పలువురి మన్ననలు పొందారని కరస్పాండెంట్ డాక్టర్ రాటకొండ గురుప్రసాద్ తెలిపారు. శుక్రవారం కళాశాలలో ఏర్పాటు చేసిన విద్యార్థుల అభినందనసభలో ఆయన మాట్లాడుతూ... రోజు రోజుకీ కనుమరుగవుతున్న జానపదకళలను, సంప్రదాయ గిరిజన తెగలకు చెందిన వ్యక్తులు, వారి ఆచార వ్యవహారాలను నేటితరానికి పరిచయం చేయాలనే ఉద్దేశంతో కళాశాల విద్యార్థినులు బంజారా, కోయ నృత్యాలను ఎంచుకున్నారన్నారు. జానపదాల ప్రాముఖ్యతను తెలిపేలా తమ విద్యార్థులు ప్రదర్శించిన కళారూపాలు యువజనోత్సవాల్లో పలువురిని ఆకట్టుకోవడం, అభినందలు అందుకోవడంపై హర్షం వ్యక్తం చేశారు. బంజారా గ్రూప్‌డ్యాన్స్‌లో ప్రథమ బహుమతి, కోయగ్రూప్ డ్యాన్స్‌లో రెండో బహుమతి, ఫోక్ గ్రూప్ సాంగ్‌లో మొదటిబహుమతి, ఫోక్ సోలోడ్యాన్స్ మొదటి బహుమతి, సోలో కోయడ్యాన్స్‌కు రెండో బహుమతి, సోలో ఫోక్‌సాంగ్‌కు రెండోబహుమతి సాధించారన్నారు. విజేతలుగా నిలిచిన విద్యార్థులు రాష్ట్ర స్థాయి యువజనోత్సవాల్లో పాల్గొంటారన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ రమాదేవి, డాన్స్‌మాస్టర్‌లు సురేష్, సౌజన్య, పీడీ శరత్ పాల్గొన్నారు.



ప్రతిభ చూపిన విద్యార్థులను అభినందిస్తున్న కరస్పాండెంట్ గురుప్రసాద్, ప్రిన్సిపాల్ రమాదేవి

రీసర్వేపై రైతులకు అవగాహన

- జిల్లా సర్వే అధికారి జయరాజ్

మదనపల్లె : భూములపై నెలకొన్న వివాదాలను పరిష్కరించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న జగనన్న శాశ్వత భూహక్కు–భూరక్ష రీసర్వేకు సంబంధించి ప్రజలు, రైతులకు అవగాహన కల్పించాలని జిల్లా సర్వే, భూరికార్డుల అధికారి జయరాజ్ అన్నారు. శుక్రవారం మదనపల్లె మండలంలోని వెంకప్పకోట గ్రామంలో మూడోవిడత రీసర్వేలో భాగంగా జరుగుతున్న పనులను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. సర్వే చేయాల్సిన విధానంపై గ్రామ సర్వేయర్లకు పలు సూచనలిచ్చారు. ఈ సందర్భంగా జయరాజ్ మాట్లాడుతూ..అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో సమగ్ర భూసర్వే చేస్తున్న తొలి రాష్ట్రం ఆంధ్రప్రదేశ్ అన్నారు. 1930 తర్వాత జరుగుతున్న సమగ్ర భూసర్వేపై ఆయా గ్రామాల్లో గ్రామసభలు నిర్వహించి రైతులకు కలిగే ప్రయోజనాలను వివరించాలన్నారు. సర్వే ప్రాముఖ్యతను తెలిపి, సమాచారం అందించాలన్నారు. మదనపల్లె డివిజన్‌లో మూడో విడత రీసర్వే 35 గ్రామాల్లో జరుగుతోందన్నారు. సర్వే పనులు నాణ్యతతో చేపట్టి ఎక్కడా వివాదాలకు తావు లేకుండా చూడాలని సిబ్బందిని ఆదేశించారు. కార్యక్రమంలో డివిజనల్ సర్వేయర్ కృష్ణమూర్తి, గ్రామ సర్వేయర్లు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.



వెంకప్పకోటలో రీసర్వే పనులను పరిశీలిస్తున్న జిల్లా సర్వే, భూరికార్డుల అధికారి జయరాజ్

ఆ ఊరి పేరు మారుస్తాం

కురబలకోట: మండలంలో పిచ్చలవాండ్లపల్లె గ్రామంలోని పందివానిపెంట ఊరి పేరును మారుస్తామని మండల పరిషత్ ప్రత్యేక ఆహ్వానితులు బైసాని చంద్రశేఖర్ రెడ్డి, ఎంపీపీ బి. దస్తగిరి తెలిపారు. శుక్రవారం సాక్షిలో ఆ ఊరి వారు ఊరి పేరు చెప్పలేరన్న వార్త ప్రచురితమైన విషయం తెలిసిందే. ఇందుకు వారు స్పందిస్తూ ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి సహకారంతో ఆఊరి పేరును మార్చడానికి మండల పరిషత్‌లో కూడా తీర్మానం చేస్తామన్నారు. పలకడానికి చెప్పడానికి ఆపై వినడానికి కూడా ఇబ్బందికరంగా ఉన్న పందివానిపెంట అనే ఊరి పేరుకు బదులుగా గ్రామస్థులకు నచ్చిన పేరును తాము ప్రతిపాదిస్తామన్నారు. జిల్లా కలెక్టర్ మొదలుకుని గెజిట్ అయ్యే వరకు వెంట నడుస్తామన్నారు. గ్రామస్థులు చర్చించి కొత్త పేరును సూచించాలని వారు కోరారు. ఇదిలా ఉండగా ఆగ్రామానికి ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి రూ. 79 లక్షలతో తారు రోడ్డు కూడా మంజూరు చేశారు. ఆపనులు కూడా ప్రారంభమైన విషయం తెలిసిందే.



పందివానిపెంట గ్రామం

ప్రతి మహిళను వ్యాపారవేత్తగా తీర్చిదిద్దాలి



మాట్లాడుతున్న డీఆర్‌డీఏ పీడీ సత్యనారాయణ

మదనపల్లె : ప్రతి మహిళను వ్యాపారవేత్తలుగా తీర్చిదిద్దడమే ప్రభుత్వ లక్ష్యమని డీఆర్‌డీఏ పీడీ సత్యనారాయణ అన్నారు. శుక్రవారం స్థానిక మండల మహిళా సమాఖ్య(వెలుగు) కార్యాలయంలో ములకలచెరువు, మదనపల్లె క్లస్టర్ సిబ్బందితో సమీక్షా సమావేశం నిర్వహించారు. మహిళాసంఘాల బ్యాంకు అప్పులు, స్త్రీనిధి ఉన్నతి, అప్పుల రికవరీపైన చర్చించారు. ప్రతి మండలంలో 25 మందిని మహిళా పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దాలని ఆదేశించారు. పుస్తక భద్రత, బ్యాంకు లింకేజీలు వంటి లక్ష్యాలు వేగవంతం కావాలన్నారు. జగనన్న తోడు, హౌసింగ్ లోన్స్ ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో డీపీఎం ఎల్.పి.రెడ్డి, గంగాధర్, రూతు, డీపీఎం ఉన్నతి, ఏజీఎం స్త్రీనిధి ఉదయ్, ఏపీఎంలు, సీసీలు పాల్గొన్నారు.

లక్ష్మీనరసింహుడికి వెండి పాత్రలు వితరణ



వెండి పాత్రలకు అందజేస్తున్న దాతలు

గుర్రంకొండ: మండలంలోని తరిగొండలో వెలసిన లక్ష్మీనరసింహస్వామి ఆలయానికి భక్తులు రూ. లక్ష విలువ చేసే వెండి పాత్రలు, వస్తువులు విరాళంగా అందజేశారు. మదనపల్లెకు చెందిన యుగంధర్ దంపతులు శుక్రవారం ఆలయానికి చేరుకొని వెండిగంట, వెండి యజ్ఞోపవీతంలను ఆలయ అర్చకులు కృష్ణస్వామి, టీటీడీ ఇన్స్‌పెక్టర్ కృష్ణమూర్తికి అప్పగించారు. ఈసందర్భంగా ఆలయంలో స్వామివార్లకు ప్రత్యేకపూజలు, అభిషేకాలు నిర్వహించారు. దాతలకు స్వామివారి తీర్థప్రసాదాలను అందజేసి సన్మానించారు. కార్యక్రమంలో టీటీడీ సిబ్బంది మోహన్‌రావ్, అర్చకులు గోపాలాబట్టర్, అనిల్,రాజు స్వాములు పాల్గొన్నారు.

దంత సంరక్షణపై అవగాహన అవసరం

రామసముద్రం: దంత సంరక్షణపై ప్రతి ఒక్కరు అవగాహన కలిగి ఉండాలని మండల అభివృద్ధి అధికారి నారాయణస్వామి అన్నారు. శుక్రవారం మధ్యాహ్నం రామసముద్రం మండలం గొల్లపల్లి ప్రాథమిక పాఠశాలలో రోటరీక్లబ్ ఆధ్వర్యంలో దంత సంరక్షణపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతిరోజూ పళ్లను శుభ్రపరుచుకోవాలని చెప్పారు. గత 20 ఏళ్ల నుంచి రామసముద్రం మండలంలో పుంగనూరు రోటరీక్లబ్ వారు నిర్వహిస్తున్న సేవా కార్యక్రమాలను ఆయన కొనియాడారు. అనంతరం దంత వైద్యులు శరణ్‌కుమార్ మాట్లాడుతూ పిల్లలు దంత సంరక్షణ విషయంలో తగిన శ్రద్ధ వహించాలని కోరారు. ప్రతి రోజు రెండుసార్లు పళ్లను శుభ్రం చేసుకోవాలన్నారు. దంత సంరక్షణ పట్ల అవగాహన కల్పించారు. రోటరీక్లబ్ అధ్యక్షుడు అనిల్‌కుమార్ ఆధ్వర్యంలో గొల్లపల్లి , కెసి.పల్లి, ఈ.కొత్తూరు, పురాండ్లపల్లి, గంపనపల్లి , మినికి , మూగవాడి పాఠశాలల విద్యార్థులకు ఉచితంగా పేస్టు, బ్రెష్‌లు అందజేశారు. కార్యక్రమంలో మండల విద్యాశాఖాధికారి ఆంజనేయులు, మండల ఎస్టీయూ అధ్యక్షుడు అయూబ్‌ఖాన్, పాఠశాలల విద్యాకమిటీ చైర్మన్ సిద్దిక్‌బాషా, రోటరీక్లబ్ కార్యదర్శి రాజారెడ్డి, సభ్యులు సుధాకర్‌రెడ్డి, హర్షద్‌అలీ, హరి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



విద్యార్థులకు టూత్ పేస్టు, బ్రష్‌లు పంపిణీ చేస్తున్న ఎంపీడీఓ నారాయణస్వామి

సమస్యల పరిష్కారమే ప్రభుత్వ లక్ష్యం

వాల్మీకిపురం: గ్రామీణ ప్రాంత సమస్యల పరిష్కారమే ప్రభుత్వ లక్ష్యమని మండలంలోని జర్రావారిపల్లి సర్పంచ్ మునిభాస్కర్ అన్నారు. శుక్రవారం మండలంలోని జర్రావారిపల్లి పంచాయతీ వడ్డిపల్లిలో రూ.3లక్షలతో రెండు బోర్లకు మోటరు, పంపు, వైర్లు తదితర వాటిని బిగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో వచ్చిన సమస్యలను ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి దృష్టికి తీసుకెళ్లడంతో ఎమ్మెల్యే సహకారంతో రెండు బోర్లకు మోటార్లు, తదితర వాటిని ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. కార్యక్రమంలో ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ వేణుగోపాల్ రెడ్డి, ఏఈ మిథున్ చక్రవర్తి, పంచాయతీ కార్యదర్శి భారతి, ఆర్‌డబ్ల్యూఎస్ సిబ్బంది రమణ తదితరులు పాల్గొన్నారు.



మోటారు ఏర్పాటు చేస్తున్న సర్పంచ్, అధికారులు

అంతర పంటల సాగుతో ఆదాయం

వాల్మీకిపురం: ప్రకృతి వ్యవసాయంలో అంతర పంటలు వేయడం వలన అధిక ఆదాయం సాధ్యమని జిల్లా సంయుక్త సంచాలకులు చంద్రనాయక్ అన్నారు. శుక్రవారం మండలంలోని అయ్యవారిపల్లి, ఫత్తేపురంలో ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో సాగు చేసిన పంటలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతుకు నిరంతరం ఆదాయం వచ్చేందుకు అంతర పంటలను సాగు చేయించాలన్నారు. పెరటి తోటలు వేయడం వలన ఆరోగ్యం బాగుంటుందని, రసాయనాలు లేకుండా ప్రకృతి వ్యవసాయం పూర్తి స్థాయిలో చేయాలన్నారు. ఆర్‌బీకే అధికారులు పంటలను పరిశీలించి, పంట నమోదు ప్రక్రియను ఈ నెల 30వ తేదిలోపు పూర్తి చేయాలన్నారు. ఏడీఏ వాణిశ్రీ, జిల్లా ప్రాజెక్టు మేనేజర్ యశోదమ్మ, ఏవో హేమలత, మీఏఏ గణేష్, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.



పంటను పరిశీలిస్తున్న జిల్లా సంయుక్త సంచాలకులు చంద్రనాయక్

ప్రజా ఆరోగ్యానికి ప్రభుత్వం పెద్దపీట

పెద్దతిప్పసముద్రం: ప్రజల ఆరోగ్యానికి ప్రభుత్వం పెద్ద పీట వేస్తోంది. వైద్య వ్యవస్థలో విప్లవాత్మకమైన మార్పులు తీసుకు రావడంలో దేశం మొత్తం ఏపీ రాష్ట్రం వైపు చూసేలా జగనన్న ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఇప్పటికే గ్రామీణ ప్రాంత ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు ఫ్యామిలీ డాక్టర్ విధానం అమలు చేస్తోంది. తాజాగా జగనన్న ఆరోగ్య సురక్ష అనే మరో కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. గ్రామాలు, పట్టణాల్లోని ఇళ్ళ వద్దకే వెళ్లి జబ్బులున్న వారిని గుర్తించి మెరుగైన వైద్యం అందించడమే లక్ష్యంగా ప్రభుత్వం ప్రణాళిక రూపొందించింది.

ఇంటింటికీ ఏఎన్‌ఎంలు, వలంటీర్లు

జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో భాగంగా గ్రామ వలంటీర్లు ఇంటింటికీ వెళ్ళి ఆరోగ్య రక్షణపై అవగాహన కల్పిస్తారు. ఆరోగ్యశ్రీ కరపత్రాన్ని పంపిణీ చేసి సేవలను వివరిస్తారు. సర్వేలో భాగంగా ఏఎన్‌ఎంలు, కమ్యూనిటి హెల్త్ ఆఫీసర్లు ప్రతి ఇంటిని సందర్శించి ప్రజలకు ప్రాథమిక వైద్య పరీక్షలు చేసి ఆరోగ్య సమస్యను గుర్తిస్తారు. ఇంటింటీ సర్వే సమయంలో సాధారణ, దీర్ఘకాలిక వ్యాధులు, గర్భిణులు, బాలింతలు, తగిన బరువు లేని పిల్లలు, క్షయ, కుష్టు సంక్రమించని, సంక్రమించే వ్యాధులు, డెంగీ, మలేరియాతో బాధపడేవారిపై దృష్టి సారిస్తారు. సర్వే సమయంలో ఫొటో తీసి ప్రత్యేక యాప్‌లో అప్‌లోడ్ చేస్తారు. అనంతరం నిర్వహించిన పరీక్షా ఫలితాలను డాక్టర్లకు అందుబాటులో ఉంచుతారు. ఆరోగ్య సమస్యలు ఉన్నవారు వైద్య శిబిరాలకు హాజరయ్యేందుకు వీలుగా ఏఎన్‌ఎంలు టోకెన్లు అందిస్తారు. జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ప్రత్యేకంగా నియమించిన అధికారులచే నిరంతర పర్యవేక్షణ ఉంటుంది. అనంతరం ఈ నెల 30న మండల స్థాయిలో ఇద్దరు డాక్టర్ల పర్యవేక్షణలో మెగా వైద్య శిబిరం నిర్వహిస్తారు. వీరితో పాటు 104లో ఉండే డాక్టర్ అందుబాటులో ఉంటారు. మండలంలో ఎన్ని విలేజ్ హెల్త్ క్లినిక్‌లు ఉన్నాయో వాటి పరిధిలో గుర్తించిన రోగులందరికీ ఆ రోజు శిబిరంలో చికిత్స అందించే విధంగా చర్యలు చేపడతారు. శిబిరాల నిర్వహణలో ఎంపీడీఓ, తహసీల్దార్ మొదలు అన్ని శాఖల అధికారులు పాలు పంచుకోవాల్సి ఉంటుంది.



వైఎస్సార్ విలేజ్ హెల్త్ క్లినిక్

ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి



జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ప్రజలంతా సద్వినియోగం చేసుకోవాలి. రాష్ట్ర ప్రభుత్వం ప్రజల ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి సారించింది. వలంటీర్లు, ఏఎన్‌ఎంలు నిర్వహించే ఇంటింటి సర్వేకు ప్రజలు సహకరించాలి. మండల స్థాయిలో జరిగే మెగా వైద్య శిబిరంలో రోగులకు మెరుగైన వైద్య సేవలు అందిస్తాం.

-డాక్టర్ శంకర్,
కందుకూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం